
# వశీకరణం



మల్లావధాని ఒకటవరకం బండఘటం. అవు నన్నది కాదనడం వాడికి పరిపాటి. అస్తమానం ఏదో వొకటి వాగుతూనే ఉంటాడు. కనపడ్డవారి నందర్నీ కవ్వించి కయ్యానికి కాలుదువ్వుతాడు. చివరికి బ్రహ్మని తిమ్మిచేసో, తిమ్మిని బ్రహ్మ చేసో వాళ్ల మొహం మాడ్చేసి పంపించేస్తాడు. దుష్టుడికి దూరాన వుండడం మంచిదని అందరూ ఈ పెంకి ఘటానికి దూరంగా తొలగిపోతారు. కుర్రాళ్లం మాకు మాత్రం వాడితో కలసి మెలిసి వుండడమంటే చాలసరదాగావుండేది. ప్రతిరోజూ పొద్దున్నే లేవడం, కాలకృత్యాలు తీర్చుకొని వాడి గదికి చేరడం, అప్పటినుంచీ కేరింతలు కొడుతూ కాలక్షేపం చేయడం — యిదీ మా దినచర్య.

ఒకరోజు మామూలుగా మొహం గట్రా కడుక్కొని వాడి గదికి వెళ్లేను. అప్పటికే వెంకట్రావు, సత్యం వచ్చేశారు. నేను వెళ్లేటప్పటికి ముగ్గురూ మహాఘోరంగా వాదించుకుంటున్నారు. వెంకటరావూ సత్యం ఒకపార్టీ. మల్లావధాని ఒకపార్టీ. అందరూ నేను రావడం చూశారు. "ఓహో వాసుగూడా వచ్చాడు. ఇక మీరు ముగ్గురుగాదు ముప్పైమందయినా నన్ను బోల్తా కొట్టించలేరులే" అన్నాడు అవధాని.

సత్యం "వాసూ రారా, గంటనుంచి వాదిస్తున్నా వీడు ఒప్పుకోడు! ఎప్పుడూ యింతే. వెధవ వేషాలూ వీడూ వొళ్లు మండుతుంది." అన్నాడు.

"అసలు మనవాడు ఎడ్డెం అంటే తెడ్డెం అనేరకమేగా! సరేగాని అసలు సంగతేమిటి" అన్నాను నేను.

"అదికాదురా వాసూ-ఇరవయ్యో శతాబ్దంలోని మనుష్యులుగదా వీళ్లు? వీళ్ళకింకా చాదస్తం పోలేదు. పిచ్చినమ్మకాలూ వీళ్లూను. బుర్రలు తక్కువై ఏదో వాగుతున్నారు" అందుకున్నాడు అవధాని.

"అసలు గొడవేమిటో చెప్పవేం?"-నేనడిగాను.

"ఏమో వాళ్లనే అడుగు మధ్యనాకెందుకు."

కొంపదీసి నన్ను ఏడిపించడానికి వీళ్లు నాటకమాడటం లేదు గదా అనుకున్నా. ఇంతలో వెంకట్రావు "ఒరేయ్ వీడు ఏదన్నా పూర్వాచారాలూ, పిచ్చి నమ్మకాలు అని చంపుకు

"శశి"

తింటాడు. సత్యం వశీకరణతంత్రా లున్నాయన్నాడు. దాంతో ప్రారంభమైంది గొడవ" అన్నాడు.

"వశీకరణ తంత్రాలు కాదు. మీతలకాయ తంత్రాలు. పిచ్చికబుర్లు చెప్పకండోయ్" అని ప్రారంభించాడు అవధాని.

"ఒరేయ్! నీకేం తెలుసు? నిన్నగాక మొన్న కళ్లు తెరచిన గుడ్డువి. వాత్స్యాయన కామసూత్రాల్లో ఏం చెప్పాడో తెలుసా!"- ఇంకా పూర్తవలేదు అప్పుడే మధ్యలో సడన్ బ్రేక్. "వాత్స్యాయనుడు- కామసూత్రాలు. అబ్బో పెద్ద కళ్లు తెరచిన గుడ్డువు బయలు దేరావే? ఇవన్నీ డబ్బు చేసుకునేందుకు రాసిన గ్రంథాలు"— అవధాని రిమార్కు. ఇద్దరూ వాదనకు హెచ్చు స్థాయిలో ఉపక్రమించారు.

"అబ్బే కాదురా. ఆ మందులూ, ఆ తంత్రాలూ అన్నీ నిజం."

"అవును. తెల్లకాకి పిత్తమును దున్నపోతు జున్నుతో కలయనూరి స్త్రీకి పులుమితే ఆమె యీ పెద్దమనిషిని విడువలేక పలవరిస్తుంది. ఇదే కదూ ఎంత రాసినా? అర్థం లేని వ్రాతలూ - మీరూ- ఎంతైనా బాగుంది."

"చేతబడులూ అవీ నిజమై చచ్చిపోతూ వుంటే వశీకరణాలుమాత్రం ఎందుకు నిజమవవు?" వారంరోజులు క్రింద చచ్చిపోయిన కామయ్యను ఎవరో చేతబడి చేసి చంపేరని వూర్లో పుకారు.

"అవునురా అబ్బాయి. మొన్న మాయింట్లో చచ్చిపోయిన పిల్లికూడా చేతబడి వల్లే చచ్చిపోయింది కదూ!—"

"అవునులే బాబూ. యతంటే ప్రతనే రకానివి. నీతో వాదించడం మాదే తప్పు"

"పోండోయ్. మీరు వాదించకపోతే నాకు నష్టమొచ్చి పడింది గాబోలు. ఒకసారి సాక్షి చదవండిరా బాగుపడతారు. ఇలాంటి పిచ్చి నమ్మకాల్ని ఖండించి బాగా బుద్ధి వచ్చేటట్లు వ్రాశాడు."

ఈ విధంగా మూడుగంటలసేపు వాదించుకున్నాము. చివరికి ఎంతకీ ఆ సమస్య తేలలేదు. ఎవరిదారి వారు పట్టేము. మళ్ళీ మధ్యాహ్నం మూడింటికల్లా హాజరవవలసిందేగా అందరూ. మధ్యాహ్నం రెండు గంటలకి రెండు టేబులు కాన్ఫరెన్సు మొదలుపెట్టేము. వశీకరణ తంత్రం మీదజోరుగా వాదన జరిగింది. చచ్చిచెడి యెలాగైతేనేం వాడిని ఒప్పించాము. మళ్లావధాని "ఒరేయ్ నాకుమాత్రం నమ్మకం లేకపోవడమేమిటి? ఊరికే మిమ్మల్ని ఏడిపించడానికలా అన్నాను గానీ" అన్నాడు.

తర్వాత వారంరోజులు గడిచాక ఒక కోయ పిల్ల "గచ్చకాయలూ, గురివింద గింజలోయ్" అని అమ్ముతూ మా వీధి దారిని వెళుతున్నది. అవధాని యెగిరి గంతేసి ఆ పిల్లను పిలిచాడు. "ఏ అమ్మాయ్! నీకు మంచి బహుమానం ముట్ట చెబుతాంగాని నీదగ్గరేమైనా వశీకరణం మంత్రాలున్నాయా?" అని అడిగాడు. వీడి వాలకం, వ్యవహారం అంతా చూసి "అయ్యో లేకపోతేమేమిటి మారాజా-కాని అయిదురూపాయ లౌతుంది" అంది కోయపిల్ల.

ఇదేమిట్రా వీడిలా మారిపోయాడని ఆశ్చర్యపడ్డాం మేము. వాడు పెట్టెలోంచి గబగబా అయిదురూపాయలనోటు తీసి దాని కిచ్చాడు. కోయపిల్ల తనలో తాను నవ్వుకుంది. "సరే త్వరగా యియ్యి, ఎవరైనా చూస్తారు" అన్నాడవధాని. "అంత భయమెందుకు దొరా" అని ఆ కోయది ఒక మూలికతీసి అవధాని చేతిలో పెట్టింది "నిన్ను నూసిన పిల్ల నిన్నొదలలేదుగో దొరా" అని కూనిరాగాలుతీసి "హ్రాం, హ్రీం, హ్రూం, హుంఫట్ స్వాహా" అని మంత్రించింది. "పిల్లా దీన్నేం చేయాలి? ఇదే గనుక ఫలించిందా అంటే నీకు మంచి బహుమానం దొరుకుతుంది" అన్నాడవధాని.

"తొందరపడతా యేమిటి యినుకో దొరా" అని రాగాలు తీస్తూ మొదలెట్టింది. "పార్వతీ పరమేశా పేర్థించి అడిగిందీ-ఓ అయ్యా-మా వ్రైబో" అంటూ మమ్మల్ని ఖూనీ చేసింది. ఏమిటంటేటా-ఈ వశీకరణ మంత్రాన్ని పార్వతికి పరమేశ్వరుడు చెప్పేడుట. (ఎందుకో!) పార్వతి వినాయకుడికి చెప్పిందిట. గణపతి దీన్ని "శుకమహర్షి" కుపదేశించాడు. శ్రీ శుకుల వారు శౌనకాది మహర్షులకు చెప్పేరట. ఈ విధంగా ఈ మూలికారహస్యం కోయ గురువు దాకా వచ్చి అతని వద్దనుంచి దీనికి సంక్రమించిందిట. ఈవిధంగా ఇంకా ఏవేవో చెప్పింది.

"అవునురోయ్. ఇది మైసూరు ప్రభువు దేవరాయలు వ్రాసిన రతిరత్న దీపికలో తంత్ర ప్రకరణంలో ఉదహరింపబడి వుందిరా! ఇది నాకిదివరకే తెలుసు. కాని దీన్ని గురు మూలకంగా తెలుసుకోవాలట" అని ఉపన్యసించాడు సత్యం. ఈ మాటలన్నీ వినేటప్పటికి అవధానిలో ఓపిక సంపూర్ణంగా చచ్చిపోయింది.

"ఉండండిరా కొంచెంసేపు, చంపక-అవతలకు పోండి. వెధవ గొడవ చేయక" అని విసుగుకొని, ఆ కోయదానితో "అయితే దీన్నెలా వుపయోగించాలి?" అని అడిగాడు.

"చెప్తా విను దొరా. ఈ మూలికను ఎడమ చేతితో పట్టుకొని ఓంనమః కామాఖ్యాదేవీ అముకీంమే వశుకురు కురుస్వాహా అని జపించి ఇష్టదేవతా ప్రార్థన చేసుకోవాలి. తర్వాత గురువుపేరు చెప్పి ఇది గురువాజ్ఞ అని లోపల అనుకొని నువ్వు వలచిన బాల, కన్య, యువతీ, ప్రౌఢ, వృద్ధలలో ఎవరినైనా సరే కుడిచేత్తో కొంగు గట్టిగా పట్టుకొని బలం కొద్దీ లాగాలి. అప్పటినుంచి ఆ పిల్ల నీకోసం రాత్రింబవళ్ళు పలవరించి హా! ప్రియా! అధరామృతమీయవా? నీ పరిరంభ సుఖంకోసం నేను విరహబాధతో శోషించిపోతున్నాను. నన్ను ఏలుకో నా వరాల రాజా అని గట్టిగా కౌగలించుకుంటుంది."

"ఇలాగేనా గుప్పిడిలో పట్టుకోడం!" అన్నాడు అవధాని.

"అవును దొరా! తంత్రం మరచిపోకు. తంత్రం తప్పితే మంత్రం తప్పుతుంది. మంత్రం తప్పితే మహిమ చెడుతుంది. ఆపైన నీయిష్టం."

"అందుకేలే" అని అవధాని పద్మాసనంవేసి ఎడమగుప్పిట మూలిక బిగించి మంత్రం చదివి, లోపల యిష్టదేవతా ప్రార్థన చేసుకున్నాడు గాబోలు. ఇంతేనా పిల్లా అన్నాడు. "అవును దొరా. తలచిన కార్యం అయితీరుతుంది. ఇంక సెలవా దొరా? బహుమతీ తర్వాత యిప్పిద్దురుగాని" అంది కోయది. మల్లావధాని యిదేం వినిపించుకొనే స్థితిలో లేడు. గట్టిగా మరోకసారి మంత్రం పఠించి గురుదేవులాజ్ఞ అని దానికొంగు పట్టుకొని గట్టిగా, అమాంతంగా లాగేశాడు.

దానికి గుక్కతిరగలేదు. నోట మాట లేదు. మూక గొంతు తడి ఆరిపోయింది. "ఏదీ-యింకా అనటంలేదే? ప్రాణనాథా- రా- మా అను రావే- ఏదీ ముద్దు అనవేం యింకా?" అని గద్దించాడు అవధాని.

"కాదు దొరా......"

"కాదేమిటి? ఏమిటంట ఆ కానిది? నువ్వు చెప్పిన మందేగా! పని చేయించు మరీ! ఎక్కడా, ఏకోశానా విరహం కనిపించడం లేదేమి సఖీ?" అని చేయిపట్టుకున్నాడు. (నాకు మాత్రం కోపం వచ్చింది సుమాండి). కోయపిల్ల గోలపెట్టింది.

"ఓసి పిచ్చిమొహమా!- ఎవరిదగ్గరో చెప్పినట్టు నాదగ్గర గూడా నాటకాలాడుదా మనుకున్నావా? అత్తరి తడాఖా! వెర్రి మొహమేసుకొని చూసెదవేలనో ప్రణయసుందరీ!- ఏమిటి చెప్పు. నీమూలిక పని చేస్తుందని ఋజువు చేసుకుంటావా? లేకపోతే చెంపలు వాయించుకొని, రెండు పుంజీల గుంజీలు తీసి, నేనిచ్చిన అయిదు రూపాయల్ని వడ్డీతో సహా యిచ్చేస్తావా?" అన్నాడు.

కోయపిల్ల చెంపలు వాయించుకొని తప్పు కాయి దొరా అంటూ కాళ్ళమీద పడింది. "సరేలే. ఈ వీధిలో మాత్రం యిలాంటి వెర్రి మొర్రి వేషాలు వేయకు. జాగ్రత్తగా మసులుకో తెలిసిందా? ఇంక వెళ్ళు. మొట్టమొదట అయిదురూపాయల నోటును రానీ-" అని దాన్ని పుచ్చుకున్నాడు. కోయపిల్ల బుట్ట సర్దుకొని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

"ఒరేయి కోయవాళ్ళ దగ్గర మంత్రాలుంటాయిరా. ఏదైనా అఘాయిత్యం చేసిందా అంటే ప్రాణాలకే ముప్పు వస్తుంది చూసుకో." అన్నాడు సత్యం.

"పోరా చవటదద్దమ్మా. ఈ మంత్రం, తంత్రం, యంత్రం, జపం, ఇంత ఏడిసింది. ఇంక ఆమంత్రం వస్తుంది కాబోలు మన కొంపలు తీయడానికి. ఏం, అయిందా? నెత్తీ నోరూ బాదుకొని బాబూ వినరా, ఇవన్నీ పిచ్చిమాటలు అంటే విన్నావా? మీకింక అలా కాదనుకొని- ఇదిగో ఋజువు చేసి చూపించాను కదూ!" అన్నాడు అవధాని.

సత్యం తెల్లబోయి నోరు తెరచుకొని శూన్యంలోకి వెర్రిగా చూస్తూ కూర్చుండిపోయాడు.